క్లుప్తంగా

నేడు రెండో విడత గొర్రెల పంపిణీ

వెల్దండ: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో సోమవారం రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ నిర్వహించనున్నట్లు డాక్టర్ శ్యామ్‌సుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరవనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అందిస్తామన్నారు. లబ్ధిదారులందరూ అందుబాటులో ఉండాలని సూచించారు.

రైతులకు అందుబాటులో ఎరువుల బస్తాలు

ఉప్పునుంతల: స్థానిక పీఏసీఎస్‌లో రైతులకు అందుబాటులో ఎరువుల బస్తాలను ఉంచినట్లు పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ 4 వేల బస్తాలు(బస్తా రూ.1,350), 20.20.0.13 కాంప్లెక్స్ ఎరువులు రూ.4 వేల బస్తాలు(బస్తా రూ.1200లు), 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు 600లు (బస్తా రూ.1500), పొటాష్ 600ల బస్తాలు (బస్తా రూ.1700), సూపర్‌ఫాస్పేట్ 600ల బస్తాలు (బస్తా రూ. 500లకు), యూరియా 400ల బస్తాలు(బస్తా రూ.267లకు) అందుబాటులో ఉన్నాయని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్‌గౌడ్



బల్మూర్: కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని ఇప్పకుంటకు చెందిన వంగ గిరివర్ధన్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లురవి, రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్‌గౌడ్ నియామక పత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు జిల్లాలో పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు.

రైతుబీమా తప్పనిసరి

కొల్లాపూర్/ బిజినేపల్లి: నూతనంగా భూమి పాసుపుస్తకం కలిగిన రైతులు ఆగస్టు ఐదో తేదీ వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని బిజినేపల్లి మండల వ్యవసాయాధికారి నీతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జూన్ 18వ తేదీ వరకు పాసుపుస్తకం పొందిన 59 సంవత్సరాలలోపు రైతులు ఈ రైతుబీమాకు అర్హులని సూచించారు. అర్హులైన రైతులు ఆధార్‌కార్డు, భూమి పాసుపుస్తకం, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లను ఆయా గ్రామాల ఏఈఓలకు ఇవ్వాలని సూచించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మాచినేనిపల్లిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగిడాల శ్రీనివాసులు టీడీపీ మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి కొల్లాపూర్‌లో ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు, సుధాకర్, రామస్వామి, కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

వెల్దండ: మండల పరిధిలోని ఈదమ్మబండతండాకు చెందిన నేనావత్ లోక్య నాయక్ ఇటీవల పక్షవాతం వచ్చింది. దీంతో అతనికి రెండు కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. ఆదివారం సింగల్‌విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్, జియాగూడ యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల చిన్నయ్యయాదవ్ బాధిత కుటుంబానికి చేయూత అందించారు. లోక్యనాయక్ వీల్ చైర్ అందజేశారు. గండయ్య, నారాయణ, రాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి వద్ద శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ రామచంద్రయ్యను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబాలకు..

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్దె తండాలో అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్త దశరథం కుటుంబాన్ని ఆదివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి భార్యాపిల్లలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దశరథం భార్యకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన తారాసింగ్ భార్య ప్రమాదానికి గురై గాయపడింది. మాజీ ఎమ్మెల్యే వారిని పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాహుల్, ఖదీర్, జగన్, వంశీ, మురళీ తదితరులు ఉన్నారు.

రోడ్లు జలమయం



కుడికిల్లలో బురదతో ఉన్న ఎస్సీ కాలనీలోని రోడ్డు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని కుడికిల్లలో అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు రోడ్లపై పారుతుంది. వర్షం వచ్చిన ప్రతిసారి నడవడానికి ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన గ్రామపంచాయతీ సర్పంచ్, అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

పెంట్లవెల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంట్లవెల్లి నుంచి కొండూరు వెళ్లే ప్రధాన రహదారిపై నీళ్లు మలుచుకుని బురదమయంగా మారింది. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ఆ గుంతల్లో నీరు చేరి బురదగా మారి వాహనదారులకు ప్రయాణం నరకయాతనగా మారింది. చిన్నపాటి వర్షానికే నీరు నిలవడం, వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేసి రోడ్లు బాగు చేయించాలని కోరుతున్నారు.



తెలకపల్లి, నెహ్రూ చౌరస్తాలో నిలిచిన నీరు



కొండూరు వెళ్లే దారిలో జలమయమైన రోడ్డు

చౌరస్తాలో మురుగు..

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో వర్షపు నీరు నిలిచి, వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన నెహ్రూ చౌరస్తా నుంచి శ్రీశైలం, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు నిత్యం బస్సులు, ప్రైవేట్ వాహనాలు తిరుగుతుంటాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. నెహ్రూ చౌరస్తా చుట్టూ సీసీరోడ్లు వేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నెహ్రూ చౌరస్తాలో ఈ సమస్య లేకుండా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఫైజొద్దీన్

కొల్లాపూర్: పట్టణంలోని రంగదాసువీధిలో అక్రమంగా తన ఇంటిని కూల్చి చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ కట్టికోత మిషన్ ఫైజొద్దీన్ కోరారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. 25 సంవత్సరాల కిందట తాను ఇంటి నంబర్ 2–8–111 ఉన్న ఇంటిని ముస్లిం మత పెద్దల సమక్షంలో సాదాకాగితంపై కొనుగోలు చేశానని చెపప్పారు. అయితే కొందరు వ్యక్తులు తప్పుడు పవర్‌ఆఫ్ అటార్నీ పత్రాలతో తనను ఇల్లు ఖాళీ చేయిచేందుకు గతంలో ప్రయత్నించారని ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయించామన్నారు. ఇంటిని అమ్మిన వ్యక్తి చనిపోవడంతో ఆయన బంధువుల పేరిట ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండానే మున్సిపల్ అధికారులు మార్చేశారన్నారు. దాన్ని ఆధారంగా చూపి రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారన్నారు. ఈ విషయాలేవీ తనకు తెలియవని వివరించారు. ఇంటి పత్రాల మార్పు వివరాలు తెలపాలని మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కుచట్టం ద్వారా దరఖాస్తు చేశానన్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల కిందట అలీ అనే వ్యక్తి తన అనుచరులతో వచ్చి జేసీబీతో ఇంటిని పడగొట్టి, చదును చేశారన్నారు. ఇంట్లోని కలపదుంగలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇటీవలే తన సామిల్ కాలిపోయిందని, ఇదికూడా అలీ వారు చేసిఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసు, మున్సిపల్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు కూడా ఆగకుండా ఇల్లు కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జూపల్లి నాగేంద్రం తదితరులున్నారు.

స్థల వివాదంలో పరస్పర ఫిర్యాదులు

కొల్లాపూర్: పట్టణం సమీపంలోని చౌటబెట్ల శివారులోని 104 సర్వే నంబర్ భూ వివాదంలో ఇరువర్గాలకు చెందిన వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. 104 సర్వే నంబర్‌లో మున్సిపల్ వైస్ పర్సన్ మహిమూదాబేగం భర్త ఖాదర్‌పాష రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేశాడు. ఈ భూమిలో కొంత కాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం కొందరు వెంచర్ ప్రహరీని కూల్చేశారు. దీనిపై ఖాదర్‌పాష పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామన్‌గౌడ్ అనే వ్యక్తితో పాటు మరికొందరు తమ వెంచర్ ప్రహరీ కూల్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామన్‌గౌడ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఖాదర్‌పాషతో పాటు మరికొందరిపై ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నట్లు ఏఎస్ఐ వెంకట్రాములుగౌడ్ తెలియజేశారు.

ఇంటి జాగ ఇచ్చే వరకు పోరాడుతాం..



మాట్లాడుతున్న పర్వతాలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో 11 రోజులుగా ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్న పెంట్లవెల్లి గ్రామ ప్రజలకు సర్వే నంబర్ 22, 27లోని భూమిని వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ గుడిసెలు వేసుకున్న ప్రజలతో ముచ్చటించారు. 2006లో ఈ భూమిని ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసేందుకు కొనుగోలు చేసిందని, నాటి నుంచి నేటి వరకు పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్పందించి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా పేదల కోసం వారి పక్షాన అండగా ఉండి సీపీఎం, సీఐటీయూ సంఘాలు పోరాడుతుంటే వారిపై అబాండాలు వేస్తున్నారని, దాన్ని ఖండిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే వెంటనే గమనించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఈశ్వర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, తరుణ్, రామకృష్ణ, శారద, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లి, కొట్ర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి పథకాన్ని గ్రామీణప్రాంత పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనారోగ్యాలకు గురైన ప్రజలు మెరుగైన వైద్యం నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన తరువాత వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం ఆస్పత్రి ఖర్చు డబ్బులను అందిస్తుందన్నారు. అనంతరం కొట్రకి చెందిన మహ్మద్ బేగానికి రూ.16 వేలు, పోతేపల్లికి చెందిన వసంతకు రూ.16 వేల చెక్కులను అందజేశారు. సురేందర్‌రెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్, నారాయణ, శంకర్‌నాయక్, రాజుయాదవ్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



తెలకపల్లి: గట్టునెల్లికుదురుకు చెందిన దుబ్బ బాలరాజు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. సర్పంచ్ సుగుణాబాబు గౌడ్ స్పందించి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,50,000 ఎల్‌ఓసీ మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం బాబుగౌడ్ బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యం నిమిత్తం ఆదివారం ఎల్‌ఓసీ అందజేశారు.

రూ.8 లక్షల ఎల్‌ఓసీ

పెద్దకొత్తపల్లి: నక్కలపల్లికి చెందిన అచ్చుతారాణి అనే బాలిక కిడ్నీ ఆపరేషన్ కోసం మంజూరు చేయించిన రూ.8 లక్షల ఎల్‌ఓసీని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బాధితురాలి తండ్రి లక్ష్మయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. సర్పంచ్ రాధిక, లక్ష్మయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



వెల్దండలో..

వెల్దండ: మండల కేంద్రంలో ఆదివారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఉమేష్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. ఏబీవీపీ సంస్థ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. దేశభక్తిని పెంపొందించే సంస్థగా ఉందని, 50లక్షల పైగా సభ్యత్వాలు ఉన్న ఏబీవీపీ సంస్థ అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సూదకుమార్, చరణ్, శ్రీకాంత్, అనిల్, సిద్ధార్థ, అభిరామ్, మణికంఠ, నిశంత్ తదితరులు ఉన్నారు.

జెండావిష్కరణ

అమ్రాబాద్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏబీవీపీ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎంతో మంది విద్యార్థుల్లో జాతీయ భావాన్ని ఏబీవీపీ పెంపొందించిందని అన్నారు. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పోరాడుతుందని వివరించారు. అంజన్‌గౌడ్, శ్రీనివాసులు, వెంకటేష్, విక్రమ్ ఉన్నారు.

బాల్యస్మృతులు మరువలేనివి



కొండనాగులలో..



కొల్లాపూర్ సమావేశంలో పూర్వవిద్యార్థులు

బల్మూర్: బాల్యస్మృతులు మరువలేమని జీహెచ్ఎం విష్ణుమూర్తి అన్నారు. మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 పదో తరగతి విద్యార్థుల బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. గోపాల్‌రావు, జనార్దన్‌రెడ్డి, అర్జున్‌రావు, శ్రీనువాస్, భాగ్యలత, నర్సింహరావు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టేబుల్స్ వితరణ..

తాము చదివిన పాఠశాలలో 1992–93 బ్యాచ్ గుర్తుగా పూర్వవిద్యార్థులు కొండనాగుల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రూ.95 వేలతో విద్యార్థుల కోసం 40 కంప్యూటర్ టేబుల్స్‌తో పాటు కుర్చీలను వితరణ చేశారు.

ఆత్మీయ సమ్మేళనం

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో 1988–89 విద్యాసంవత్సరంలో ఎస్‌ఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఎస్‌ఎం గార్డెన్‌లో సమావేశమయ్యారు. ఆత్మీయ సమ్మేళనంలో వారు కలిశారు. యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులను చర్చించుకున్నారు. తాము చదువుకున్న కాలంనాటి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు రుణపడి ఉంటామన్నారు. సమావేశం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వవిద్యార్థులు సాయిబాబుశెట్టి, వేములవాడ రమేష్ ముదిరాజ్, కరీమ్, షఫీ, రజినీ, కిషన్‌సింగ్ తదితరులున్నారు.

పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన



ప్రహరీ వివరాలు తెలుసుకుంటున్న మర్రి జమున

తాడూరు: మండల కేంద్రంలో ఎంజేఆర్ ట్రస్టు ద్వార అధునాతన హంగులతో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంజేఆర్ ట్రస్టు డైరెక్టర్ మర్రి జమున అన్నారు. ఆదివారం పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో దాదాపు రూ.3 కోట్లతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సహాయ సహకారాలు ఉన్నందునే ఎమ్మెల్యే పేద విద్యార్థులకు తనదైన శైలిలో స్పందిస్తున్నారని అన్నారు. మండల కేంద్రంతో పాటు సిర్సవాడలో భవన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయన్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యార రమేశ్, మంచల పర్వతాలు, సీఈఓ ఆంజనేయులు, గౌరికుమార్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: కవి, గాయకుడు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ సంస్మరణ సభను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఘన నివాళి అర్పించారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సురేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, కల్వకుర్తి ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం



అచ్చంపేట రూరల్: ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న నిరుపేద విద్యార్థిని సుస్వరకాంక్షకు ఆదివారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. గతంలో మొదటి, ద్వితీయ సంవత్సరంలోనూ ఆర్థికసాయం అందజేశామని క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి బంధం పరమేశ్వరప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది కొట్ర ప్రవీణ్ రూ.10 వేలు, లగిశెట్టి దివ్య ప్రశాంత్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారని తెలియజేశారు. క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధులు గోపాల్‌నాయక్, సాయిప్రసాద్, నరేష్, వినోద్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఈటలను కలిసిన ఎల్లేని సుధాకర్‌రావు



ఈటలను సత్కరిస్తున్న సుధాకర్‌రావు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు ఆదివారం హైదరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను కలిశారు. బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్ నియమితులు కావడంతో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గంతో పాటు, జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులను ఈటలకు వివరించినట్లు విలేకరులకు వెల్లడించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి దాతలు ఆదివారం సర్పంచ్ అంజినాయక్ రూ.52 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పరాన్ మిరావలి, కండె లింగయ్య రూ.10,116 చొప్పున, మొండెం చంద్రశేఖర్, వెంకటయ్య, ఎంగలి బాలకృష్ణ, రంగయ్య జూలూరి రవీంద్రనాంద్ గుప్త, సతీష్ ఒక్కొక్కరు రూ.5,016 చొప్పున, ఈశ్వరయ్య రూ.2,116ను అందజేశారు. నేనావత్ తార్‌సింగ్, లచ్చిరాం, నరేష్, సంతోష్, బాలు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న గీత



వెల్దండలో..

ఉప్పునుంతల/వెల్దండ/ బిజినేపల్లి/ తెలకపల్లి/ తాడూరు: సమస్యలు పరిష్కరించాలంటూ పంచాయతీ కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. కార్మికులు శివ, బాలయ్య, రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు అండగా ఉంటాం

బిజినేపల్లి: గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పని చేసే కార్మికులకు బీఎస్పీ తరపున తాము ఎప్పుడు అండగా ఉంటామని బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు నిర్వహించిన నిరవధిక సమ్మెలో కొత్తపల్లి కుమార్ పాల్గొని మద్దతు తెలియజేశారు.

బెదిరించడం దుర్మార్గం

నాగర్‌కర్నూల్ రూరల్: పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయితీ కార్మికులు సమ్మె బాట పడితే రాష్ట్ర ప్రభుత్వం వారిని బెదిరించే ప్రయత్నం చేస్తుందని, ఇది దుర్మార్గమని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత ఆరోపించారు. ఆదివారం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



తెలకపల్లిలో మాట్లాడుతున్న చంద్రకళ



తాడూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట

ఇంటి సామగ్రి పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగులలో 10 మంది నిరుపేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి చైర్మన్ వెంకటేష్ పూజలు చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన బాలమ్మకు ఇంటి నిర్మాణం కోసం సిమెంట్, సీకులను చైర్మన్ వెంకటేష్ పంపించారు. గ్రామానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గణేష్ సామగ్రి అందజేశారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం..

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. మండలంలోని గుండూర్‌కి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వెంకటయ్య ఇటీవల మృతిచెందాడు. దీంతో బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

